క్లుప్తంగా

నేడు సాగునీటి ప్రాజెక్టులపై సదస్సు

పాతమంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే డిమాండ్లతో రాజకీయ, వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో ఆదివారం సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శనివారం వామపక్ష పార్టీల నేతలతో సదస్సు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, తెలంగాణ ప్రజాఫంట్, రెడ్ స్టార్, పీవోడబ్ల్యూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'మా కాలేజీలో చేరండి'


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్

దండేపల్లి: ఇంటర్మీడియెట్ పూర్తయిన తర్వాత డిగ్రీ చదివేందుకు తమ కాలేజీలో చేరాలని లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కోరారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం తమ సిబ్బందితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులతో మాట్లాడారు. కాలేజీ ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, మౌలిక వసతులు, అందించే బోధన, హాస్టల్స్‌ను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైపూర్: మండలంలోని కుందారం సబ్‌స్టేషన్ పరిధిలో ఏడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లో పాత పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శివాజి

మంచిర్యాలటౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, కార్మికులు సకాలంలో విధులకు హాజరై పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ శివాజి అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం ఆయన పర్యటించి, పారిశుధ్య కార్మికులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. వారితో మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత కార్మికుల చేతుల్లోనే ఉందని, ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తిస్తే చాలన్నారు. కార్పొరేషన్‌గా మారడంతో మరింత బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉంటుందని, ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించాలని సూచించారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసే పరిస్థితి ఉందని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే పరిస్థితి ఉందని, విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ విద్యకు వత్తాసు పలికేలా బడ్జెట్‌ను కేటాయించారని, విద్యార్థులకు కావాల్సిన పెన్ను, పెన్సిల్‌లపై జీఎస్టీ వేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉమర్ షరీఫ్



జన్నారం: జన్నారం మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో ఉమర్‌షరీఫ్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీవో శశికళ ఉద్యోగ విరమణ పొందడం వల్ల ఎంపీవోగా ఉన్న షరీఫ్‌కు బాధ్యతలు అప్పగించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

రుసుం వసూలుకు ప్రతిపాదనలు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యం ప్రాంతం గుండా వెళ్లే వాహనాలకు పర్యావరణ రుసుం వసూలుకు ప్రతిపాదించినట్లు ఎఫ్‌ఆర్‌వో శివకుమార్ తెలిపారు. కోటపల్లి మండలం పారుపల్లి చింత దగ్గర, చెన్నూర్ మండలం కిష్టంపేట వై జంక్షన్ వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టుల ద్వారా కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

జోరుగా గంజాయి దందా..!



- చాపకింద నీరులా సాగుతున్న వ్యాపారం
- లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలో రవాణా
- బానిసలవుతున్న యువకులు

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గంజాయి వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీనిపై ఇప్పటివరకు ఎక్సైజ్ పరిధిలో కేసులు నమోదు కాకపోవడం గమనార్హం. ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో చేరాల్సిన చోటుకు సరకు ఎలాగోలా గమ్యస్థానాలకు చేరుతోంది. ఎక్సైజ్ శాఖకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో గంజాయి రవాణాదారుల ఆట కట్టించలేకపోతున్నారు. లక్సెట్టిపేట సర్కిల్ పరిధిలోని దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం మండలాల్లో గంజాయి రవాణా జోరుగా సాగడంతో చాలామంది యువకులు గంజాయికి బానిసవుతున్నారు.

చీకటిపడితే చాలు...

చీకటిపడితే చాలు చాలా గ్రామాల్లో యువకులు రహస్య ప్రదేశాలకు వెళ్లి గుంపులుగా ఓచోట చేరి గంజాయిని సిగరేట్ల ద్వారా తాగి, మత్తుకు లోనవుతున్నారు. యువకులు, మైనర్లు కూడా అలవాటు పడుతున్నారు. అసలు గంజాయి ఎక్కడ నుంచి సరఫరా అవుతుంది.. ఎవరు తీసుకొస్తున్నారు.. స్థానికంగా ఎవరు విక్రయిస్తున్నారు అనేదానిపై దృష్టిపెట్టి, దానిని నివారిస్తే తప్పా, యువకులు దీనిని మానుకునేలా లేరు. కొన్నికొన్ని చోట్ల కిరాణ దుకాణాల సమీపాల్లో సిగరేట్లు తాగేందుకు ప్రత్యేక అడ్డా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అలాంటి ప్రదేశాలకు కూడా కొందరు గంజాయి తీసుకొచ్చి తాగుతున్నట్లు సమాచారం.

సిబ్బంది కొరత...

సర్కిల్ పరిధిలో ఇద్దరు ఎస్సైలకు ఒక్కరే ఉన్నారు. సీఐ కూడా లేక పోవడంతో మంచిర్యాల సీఐకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎక్సైజ్ శాఖ వద్ద ఆధునిక సాంకేతిక అందుబాటులో లేదు. ఏదైనా అవసరముంటే పోలీసుల సహకారమే తప్పా వేరే మార్గం లేదు. అయినప్పటికీ ఎక్సైజ్ శాఖ ఎక్కువగా గుడుంబాపై మాత్రమే దృష్టిపెట్టడంతో గంజాయి రవాణ జోరుగా సాగుతోంది. ఎక్సైజ్ శాఖ గుడుంబాతో పాటు, గంజాయిపై దృష్టిసారించి దీనిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టిపెడతాం..

యువకులు గంజాయికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు. గుడుంబా నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇకపై గంజాయి తరలించే వారిపై కూడా దృష్టి పెట్టి గంజాయి రవాణాను నివారిస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– సమ్మయ్య, ఎక్సైజ్ సీఐ, లక్సెట్టిపేట

'టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దుతాం'


పెద్ద చెరువు కట్టపై శుభ్రం చేస్తున్న కార్మికులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని పెద్ద చెరువుపై నిర్మించిన ట్యాంకుబండ్‌ను టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై శనివారం కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పెద్ద చెరువు పరిసర ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి, సందర్శకులతో పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ప్రసిద్ధిగాంచిన అంబాఅగస్తేశ్వర గుండంగా పిలువబడే పెద్ద చెరువు వద్ద బహిరంగ మల, మూత్ర విసర్జనలతో దుర్వాసనతో అధ్వానంగా మారిందన్నారు. దీంతో ఇక్కడకు వచ్చే వారికి ఇబ్బంది కలుగుతుంది. అందుకే ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అపరిశుభ్రత అయ్యేలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లక్ష్మీదేవర జాతరకు ఏర్పాట్లు పూర్తి


బట్టి గూడెంలోని లక్ష్మీదేవర ఆలయం

చెన్నూర్: ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం లక్ష్మీదేవర బోనాల జాతరకు చెన్నూర్‌లో ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రాచీన చరిత్ర కలిగిన ఈ బోనాల ఉత్సవాలకు చెన్నూర్ పట్టణవాసులే కాకుండా పరిసర ప్రాంతాలతో పాటు బెల్లంపల్లి, మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాదిగా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. చెన్నూర్ పట్టణంలోని బట్టిగూడెం, పాత బస్టాండ్ ముదిరాజ్ కాలనీల్లో గల లక్ష్మీదేవర ఆలయాల్లో ఆదివారం ఆటాపాట, సోమవారం బోనాల ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి ఆలయ ప్రాంగణంలో పూలతో అలంకరించి అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆదివారం పట్నాలు సమర్పించిన అనంతరం, మధ్యాహ్నం రెండు గంటలకు బోనాల జాతర ప్రారంభమవుతుందని ఆలయ పూజారి గిరెల్లి మల్లయ్య తెలిపారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సంపూర్ణ సురక్ష కేంద్రం సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో హాజీపూర్ మండలంలోని రాపల్లి బుగ్గగట్టు గ్రామంలోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికులకు బీపీ, షుగర్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ టెస్టులను 98మందికి చేశారు. కార్యక్రమంలో దిశ సీఎస్‌వో రాజేశ్, సంతోశ్, డీఎస్‌ఆర్‌సీ కౌన్సిలర్ నరేందర్, మేనేజర్ సతీశ్, అన్నపూర్ణ, కిషన్, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశావర్కర్ పుష్పలత, ఇటుకబట్టీల ఇన్‌చార్జి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

వేమనపల్లి: మండలానికి జూనియర్ కళాశాల మంజూరుకు కృషి చేసిన సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మండల మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి మధు, రాంచందర్, జాయెద్‌అలీ, మొర్ల రమేశ్, అదె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శనివారం కరీంనగర్‌కు చెందిన మెడికేర్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక న్యాయమూర్తి కే.నిరోష హాజరై ప్రారంభించారు. న్యాయవాదులు ఆరోగ్య రిత్యా ధృడంగా ఉండాలని సూచించారు. న్యాయవాదులు ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. పనిబారం పెరగడంతో బీపీ, షుగర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. న్యాయవాదులు కొత్త సత్తయ్య, రంగు మల్లేష్, అరమండ రవికుమార్, చెట్ల రమేశ్, చాణక్య, మహిళా న్యాయవాదులు రాధిక, సత్య, శ్రీలత పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో శనివారం సాయంత్రం తాళ్లగురిజాల పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్ ఆధ్వర్యంలో తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల ధృవీకరణ పత్రాలను, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ప్రతీ వాహనదారుడు వాహన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో తాళ్లగురిజాల ఏఎస్సై మజారుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక

దండేపల్లి: రేషన్ డీలర్ల సంఘం దండేపల్లి మండల నూతన కమిటీని శనివారం దండేపల్లిలో సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపల్కుల సత్తయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నల్లెల మల్లేష్, ఉపాధ్యక్షుడుగా రాపెల్లి జయంతయ్య, ప్రధాన కార్యదర్శిగా మడావి తుకారం ఎన్నికయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: ఈ నెల 14, 15, 16తేదీల్లో మందమర్రి బొక్కల గుట్ట శ్రీగాంధారి ఖిల్లా మైసమ్మ జాతర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను దండేపల్లి ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి శనివారం ఆవిష్కరించారు.

విద్యార్థులు నైపుణ్యం కలిగి ఉండాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు చిన్నప్పటి నుంచి నైపుణ్యాన్ని కల్గి ఉండాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజ్ఞాన సంచార ప్రయోగశాలను శనివారం పరిశీలించి మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు విద్యార్థులకు మానవ శరీర భాగాలు, వాటి ఉపయోగాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి


బహుమతులు అందజేస్తున్న ఏజెంట్, మేనేజర్

శ్రీరాంపూర్: ఉత్పత్తి లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్కే 5 గ్రూపు ఏజెంట్ శ్రీధర్ తెలిపారు. శనివారం ఆర్కే 5 గనిపై జనవరి నెలలో అధిక ఉత్పత్తి సాధనకు కృషి చేసిన ఉద్యోగులకు ఈ సందర్భంగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 6 నెలలుగా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడం అభినందనీయం అన్నారు. ఈ సంవత్సరం నూరు శాతం ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలన్నారు. అధిక ఉత్పత్తి సాధించి బహుమతులు సాధించిన ఉద్యోగులను ఇతర ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్ కుమార్, ఇంజనీర్ శ్రీనివాస్, రక్షణాధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, పిట్ సెక్రెటరీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో 91శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జనవరి మాసంలో 91శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేకే-5 గనిలో 19,775టన్నులు, కాసిపేట గనిలో 12,874టన్నులు, కాసిపేట-2గనిలో 11,007టన్నులు, శాంతిఖనిలో 4,533టన్నులు, ఆర్కే ఓసీలో 104,524టన్నులు, కేకే-ఓసీలో 108,961బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుందని, ఏరియా కార్మికులు సమష్టి కృషితో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని కోరారు. ఏరియాలో నూతన గనుల ఏర్పాటు కోసం సంస్థ కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మందమర్రి ఏరియాకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఏరియా ఉద్యోగులు రక్షణ సూత్రాలు మరవొద్దని, ప్రమాదాలకు తావు లేకుండా బొగ్గు ఉత్పత్తి తీయాలని కోరారు.

పాఠశాల స్థలం సర్వే


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

భీమిని: భీమిని మండలం వడాల గ్రామంలోని పాఠశాలకు చెందిన స్థలం కబ్జాకు గురవుతోందని గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం తహసీల్దార్ బికర్ణదాస్, రెవెన్యూ అధికారులు వడాలలోని పాఠశాల స్థలం కబ్జాపై విచారణ చేపట్టారు. అనంతరం పాఠశాల స్థలాన్ని సర్వే చేపట్టి కొలతలు తీసుకున్నారు. ఈ సర్వే రిపోర్ట్‌ను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేష్, సర్వేయర్ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సేఫ్టీ వార్డెన్ రాజమౌళి

భీమారం: మండల కేంద్రంలో ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు భద్రతపై మంచిర్యాల ఆర్టీసీ డిపో సేఫ్టీ వార్డెన్ రాజమౌళి అవగాహన కల్పించారు. బస్సులు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలని ప్రయాణికులను కోరారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు.

భక్త మార్కండేయ జయంతి


దండేపల్లి: వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీలు


పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల/దండేపల్లి: పద్మశాలీల ఆరాధ్య దైవమైన శ్రీమార్కండేయ మహర్షి జయంతిని జిల్లా కేంద్రంలోని 28వ వార్డు లక్ష్మీనగర్‌లో, దండేపల్లిలో పద్మశాలీ సంఘం, పద్మశాలీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండా ఆవిష్కరించారు.భక్త మార్కండేయ మహా రుషి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. భక్త మార్కండేయ మహరుషి ఆశీస్సులతో పద్మశాలీలు యాచించే స్థాయి నుంచి, శాసించే స్థాయికి ఎదగాలని, రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలు ఏకమై రాజ్యాధికారంలో భాగస్వామ్యం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ జేఏసీ నాయకులు భక్త మార్కండేయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, జిల్లా బీసీ జేఏసీ కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, ఆలయ అర్చకులు బూర్ల వెంకటేశ్వర్లు, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు శంకర్ నాయకులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట/తాండూర్/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతిని లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో, తాండూర్ మండలం మాదారంలో, బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంపు బస్తీలో, రామకృష్ణాపూర్ పట్టణంలో, శ్రీరాంపూర్ నస్పూర్ కాలనీలో పద్మశాలీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం వేడుకలు జరుపుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. పలుచోట్ల హోమం కాల్చారు.

తాగునీటి సమస్యలపై సర్వే షురూ..!

- టీంల వారీగా గ్రామాల్లో పర్యటన
- టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 4007 ఏర్పాటు


దండేపల్లి: ట్యాంకు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

దండేపల్లి: రానున్న వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వ్యాప్తంగా గ్రామాల వారీగా పది రోజుల పాటు నిర్వహించే సర్వే శనివారం ప్రారంభమైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేష్ తెలిపారు. సర్వే ఉద్దేశాలను ఆయన వెల్లడించారు. గ్రామాలవారీగా గ్రిడ్, ఇంట్రా అధికారులతో పాటు, జీపీ సిబ్బంది పర్యటించి చేతిపంపులు, నీటిట్యాంకులు, మంచినీటి కులాయిలు, బావులను పరిశీలించనున్నట్లు తెలిపారు. తాజా పరిస్థితితో పాటు, సమస్యలను గుర్తించి వేసవికి ముందే పరిష్కరించనున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి ట్యాంకుల శుభ్రతపై కూడా సూచనలు చేయనున్నారు. తాగునీటి సమస్యలు స్వీకరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 4007ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యను వివరించవచ్చని పేర్కొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి సబ్ డివిజన్ ఇంట్రా డీఈఈ ప్రవీణ్ కుమార్ అన్నారు. బెల్లంపల్లి మండలం గురిజాల, దుగ్నెపల్లి గ్రామాల్లో శనివారం తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నీటి ట్యాంక్‌లను, ట్యాంక్ పరిసరాలను పరిశీలించారు. ట్యాంక్‌ను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి సరఫరా చేసే పైప్‌లైన్‌లలో లీకేజీలు లేకుండా చూడాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, గ్రిడ్ ఏ.ఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీ, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని శనివారం తాగునీటి సరఫరాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్ అధికారుల బృందం గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరా, వోహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు పరిశీలించారు. అనంతరం నజీర్‌పల్లిలో పారిశుధ్య పనులు పరిశీలించారు. మిషన్ భగీరథ నీరు ఇళ్లల్లోకి వస్తున్నాయ అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ, ఈఈలు వి.వెంకటేశ్, విద్యాసాగర్‌రావు, ఏఈఈ వినయ్‌కుమార్, పంచాయతీకార్యదర్శులు సుమన్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రెయిలింగ్ నిర్మించరూ..!



భీమారం: భీమారం-నెన్నెల ప్రధాన రహదారిలో కొత్తగూడెం వద్ద నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రెయిలింగ్ నిర్మించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టి, రెయిలింగ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : భరత్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, చెన్నూర్
ఫోన్ నంబర్ : 94408 19099

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాలటౌన్: ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఐక్య వేదిక క్యాలెండర్‌ను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, ఉద్యోగుల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు టి.ప్రభాకర్, అధ్యక్షులు డి.జగదీశ్, కార్యదర్శి శంకర్, కోశాధికారి నాందేవ్, కోకన్వీనర్ యం.రమేశ్ కుమార్, జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎస్సార్పీ3, 3ఏ గనిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జన్నారం: జన్నారం మండల యాదవ సంఘం 2025క్యాలెండర్ మండల యాదవ కులస్తుల సమక్షంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎస్సై రాజవర్ధన్, వెటర్నరీ డాక్టర్ శ్వేత శనివారం ఆవిష్కరించారు.